# కథ ను నమ్ముకున్నవాడు

**కే**సు వివరాలు వింటున్న కొద్దీ ఇన్‌స్పెక్టర్ మురళీధరానికి ఇదెక్కడో ఇన్నట్టు అనిపించింది. ఇంతకుముందు కూడా ఇలాటిదే జరిగిందా? అదేదో గుర్తుకొస్తే బాగుణ్ను. 'మోడస్ ఒపరాండి' సిద్ధాంతం ఉపయోగించి నేరస్తుణ్ని పట్టుకోవచ్చు. కానీ తస్సదియ్యా, అది గుర్తుకు రావటం లేదు.

కేసు చిత్రంగా ఉంది. సరదాగా ఆరంభమయి, విషాదంగా పరిణమించింది. పారిశ్రామికవేత్త భుజంగరావు గారి హోటల్లో ఆయన వజ్రం పోయింది. జనవరి 1న లక్కీడిప్ ఏదో పెట్టారు ఆయన హోటల్లో. దానిలో నెగ్గిన ఆరుగురు వ్యక్తులకు ఆయన తన ఛాంబర్లో స్వంత ఖర్చుపై డిన్నర్ ఇచ్చాడు. గంటన్నరసేపు సాగిన డిన్నర్ టాక్‌లో అనేక విషయాలు దొర్లాయి. చివరిలో ఆయన జేబులోంచి అపురూపమైన ఒక వజ్రం చూపించి దాని గుణగణాలు వర్ణించాడు.

"అంత విలువైన వజ్రాన్ని ఎప్పుడూ మీ జేబులోనే ఉంచుకుంటానంటున్నారు. ప్రమాదం కాదా?" అన్నాడు ఓ ముసలాయన.

"దీన్ని నా దగ్గర్నుంచి కాజేసే మొనగాడు ఇప్పటిదాకా పుట్టలేదు." అన్నాడు భుజంగరావు గర్వంగా.

"కాజేయకపోయినా మాయం చేసే మాజిక్ నా దగ్గర ఉంది" అంది అపూర్వ అనే ఇరవై ఏళ్ల పడుచు.

దానిమీద పందాలు వేసుకున్నారు. మాజిక్ బాగా చేస్తే నెల్లాళ్లపాటు తన హోటల్‌లో డిన్నర్ ఫ్రీ అన్నాడు రావు. ఆ వజ్రాన్ని ఒకరి తర్వాత ఒకరు పరీక్షించి పక్కవాళ్లకు ఇస్తూ వచ్చారు. అపూర్వ వద్దకు వచ్చేసరికి ఆమె ఆ వజ్రాన్ని పరీక్షిస్తూండగానే చేయి జారింది. "అయ్యో, అయ్యో" అంటూ తటాలున లేచి నుంచోవడంతో టేబుల్ మీద నున్న గ్లాసులు పళ్లాలు క్రింద పడ్డాయి. వెనక్కాల నిలబడిన బేరర్ వచ్చి అవన్నీ శుభ్రం చేస్తూ నేల మీద చూడబోతే అక్కడ వజ్రం కనబడలేదు. అపూర్వ వేసుకున్న పంజాబీ డ్రెస్సు, చున్నీ దులిపి చూపించినా క్రిందపడలేదు. "చెప్పానా, లేదా, మీ వజ్రం హూష్‌కాకీ!" అంది అపూర్వ చప్పట్లు చరుస్తూ.

భుజంగరావు కూడా ఆశ్చర్యపడ్డాడు. కానీ నవ్వుతూ, "ఆడవాళ్లకు దాచడానికి అనేక మార్గాలు. గట్టిగా వెతికితే..." అంటూండగానే పార్టీలో ఉన్న తక్కిన ఆడవాళ్లు అపూర్వను క్షుణ్ణంగా వెతకడానికి ముందుకు వచ్చారు. చాటుగా తీసుకెళ్లి పావుగంట సేపు అంగుళం, అంగుళం వెతికి వెర్రిమొహం వేసారు. దాంతో భుజంగరావు ముఖంలో చిరునవ్వు తగ్గింది. అది గ్రహించిన పెద్దాయన ఒకరు "మ్యాజిక్‌లో అసిస్టెంటు ఎప్పుడూ ఎవరో ఒకరు ఉంటారు. వజ్రం మాయం చేయడానికి అపూర్వకు ఎవరో ఒకరు సాయం చేసి ఉంటారు. తక్కినవాళ్లందర్నీ కూడా వెతికితేనే మ్యాజిక్ సక్సెస్ అనవచ్చు. అందరూ సహకరిస్తే బాగుంటుంది" అని సూచించాడు.

ఇరవై నిమిషాలలో అందర్నీ వెతకడం పూర్తయింది, భుజంగరావుతో సహా. ఎక్కడా కనబడలేదు. భుజంగరావు మొహంలో గర్వం పూర్తిగా ఎగిరిపోయింది. కాస్సేపు మీసాలు కొరుక్కుంటూ కూచున్నాక అతనిలో షివల్రీ తిరిగివచ్చింది.

"మై డియర్ యంగ్‌లేడీ, ఓటమి ఒప్పుకుంటున్నాను. నువ్వు లేడీ హౌడినీవి. నెల్లాళ్లపాటు మా హోటల్‌లో డిన్నర్ ఎంజాయ్ చేయి. ఇంకో ఆఫర్ కూడా ఇస్తున్నాను. నువ్వు ట్రిక్ ఎలా చేసావో చెబితే నీ ఫ్రెండ్, బాయ్‌ఫ్రెండ్ ఆర్ గళ్‌ఫ్రెండ్, వాళ్లకి కూడా ఫ్రీ డిన్నర్ – ఈ నెల్లాళ్లు. వాట్ డూ యూ



సే?" అన్నాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. అపూర్వ లేచి నాటకీయంగా అభివందనం చేసింది. నవ్వుతూ, "కనీసం ఈ డిన్నర్ పేరు చెప్పి అయినా నా కో మంచి బాయ్‌ఫ్రెండు దొరుకుతాడు" అంది. అందరూ ఉగ్గబట్టుకు చూస్తూండగా.

"ఇటీజ్ సో సింపుల్. వెతికినప్పుడు మీ రెవ్వరూ నా హేండ్‌బ్యాగ్ కేసి చూడలేదు. అది నా కుర్చీకే తగిలించి ఉంది. నా బ్యాగ్ హేండిల్‌ను పరీక్షగా చూసి ఉంటే మీకు అనుమానం వచ్చేది. ఇన్ ఫాక్ట్ దాని వల్లనే నాకీ మ్యాజిక్ ఐడియా వచ్చింది. నిజానికి నేను మ్యాజిక్ నేర్చుకోలేదు, ఏమీ లేదు. రావు గారు వజ్రం చూపిస్తుండగా నాకు సడన్‌గా అనిపించింది. 'అది నా హేండ్‌బాగ్ పిడిలా ఉందేమిట్రాని. ఎటొచ్చీ అది వజ్రం ఇది గాజు ముక్క అంతే తేడా. గాజుముక్క కాబట్టే మొన్ననే విరిగిపోయింది. ఆ జాగా ఖాళీగా ఉంది. ఇప్పుడు వజ్రాన్ని పెట్టేస్తే అంతా బేగ్ పిడి అనుకుంటారు కానీ వజ్రం అనుకోరు.

అలా అనుకోగానే నేను ఛాలెంజ్ చేసాను. రావు గారు వజ్రం చేతులు మారి నా చేతికి రాగానే జారిపోయినట్లు నటించి, నా నోట్లో చూయింగ్‌గమ్ సాయంతో దాన్ని బేగ్ హేండిల్‌కు అతికించేసాను. మీరు నా బట్టలు వెతికారు. ఒళ్లంతా వెతికారు. బేగ్ కేసి ఎవరైనా చూసినా వజ్రాన్ని పోల్చుకోలేరు. నౌ సీ యువర్ ఫేమస్ వజ్రం..." అంటూ వీపు వెనక్కాల దాచుకున్న బేగ్‌ని డ్రమెటిక్‌గా ముందుకు పెట్టింది.

కానీ దాని హేండిల్‌కి వజ్రం లేదు!

జనం అంతా పగలబడి నవ్వడంతో అపూర్వ తెల్లబోతూ బ్యాగ్ తిప్పి చూసింది. వజ్రం లేకపోవడంతో ఆమె మొహం పాలిపోయింది. "వేరీజ్ ది డైమండ్?" అంటూ హడావుడిగా ఒంగి టేబుల్ కిందకు చూసింది. కుర్చీ వెనక్కి లాగి చూసింది. బట్టలు దులిపింది. బ్యాగ్‌లో చేయి పెట్టి కెలికింది. ఏం చేసినా వజ్రం కనబడకపోవడంతో కుర్చీలో కూలబడింది. ఆమె కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. భుజంగరావుదీ అదే పరిస్థితి. ఆదుర్దా, ఆందోళనలతో అతని మొహం మీద చెమట్లు పట్టాయి.

"సరిగ్గా చూడమ్మా" అంటున్నాడు మాటిమాటికీ. కొద్ది సేపట్లోనే అపూర్వ వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఇంతలో ఇందాకటి పెద్దాయన "పోలీసులను పిలుద్దాం. మనం ఎవ్వరం బయటకు కదలవద్దు. అది ఎలా మాయమయిందో వాళ్లే తేలుస్తారు" అన్నాడు. అందువల్లే మురళీధరం కదిలి రావల్సి వచ్చింది. అతని పోలీసులు కూడా ఆ గదినంతా క్షుణ్ణంగా పరిశీలించారు కానీ ఏమీ దొరకలేదు.

మురళీధరానికి పిచ్చి ఎక్కినట్టుంది. ఈ కేసు ఇంతకుముందు ఎక్కడో విన్నాడు. గుర్తుకొచ్చి చావటం లేదు. ఒక్కొక్కళ్లనీ ఇంటరాగేట్ చేస్తూ ఉంటే ఎప్పటికో అప్పటికి పోలిక తడుతుందని ఆశించాడు. ఆశించినట్లుగానే అపూర్వను ప్రశ్నిస్తూండగా ఛట్టున జ్ఞాపకానికి వచ్చింది – చిన్నప్పుడు చదివిన ఒక కథ. అందులోనూ ఇంతే – ఒక ధనికుడికి తన వజ్రాన్ని అందరికీ చూపించడం హాబీ. ఓ రోజు పార్టీలో అందరికీ అలాగే చూపిస్తాడు. మర్నాడు కూడా అదే జనాభాతో పార్టీ. "నిన్న చూపించినట్టు మళ్లీ వజ్రాన్ని చూపించు చూద్దాం, మాయం చేస్తానంటుంది" ఒక చిన్నపిల్ల. పందేనికి ఒప్పుకొని ధనికుడు వజ్రాన్ని పాస్ ఆన్ చేస్తూంటే మాయమయిపోతుంది. చివరికి ఆ పిల్ల, దాని ముఠాయే దీనికి కారకులని తేలుతుంది.

నేరస్తులు ఎవరో గుర్తుకొచ్చింది కానీ ఆ డిటెక్టివ్ ఎలా కనిపెట్టాడో తట్టలేదు మురళీధరానికి. అపూర్వతో మాట్లాడుతూనే ఆలోచిస్తూ ఉన్నాడు. "అవునూ, ఆ వజ్రాన్ని హేండ్‌బాగ్ హేండిల్‌కి ఎలా అతికించావు?" అని అడుగుతూండగా గుర్తుకొచ్చింది కథలో డిటెక్టివ్‌కి ఆ చిన్నపిల్లపై అనుమానం ఎందుకు వచ్చిందో – కథలో అమ్మాయి పేరఫిన్ మైనంతో ఫిక్స్ చేసేనంటుంది. పందెం అప్పటికప్పుడు అనుకుని వేసుకున్నది కదా, ముందుగా పేరఫిన్ ఎందుకు తయారుగా పెట్టుకున్నట్టు అని డిటెక్టివ్ ప్రశ్న.

అపూర్వ వద్ద సమాధానం రెడీగానే ఉంది – "చూయింగ్‌గమ్‌తో అంటించాను. ఇరవై నాలుగు గంటలూ అది నమలడం నా కలవాటు. నా బాగ్‌లో ఎప్పుడూ ఉంటుంది." అని. నిజానికి అప్పుడు కూడా ఆమె గమ్ నములుతూనే ఉంది.

మురళీధరానికి కథలో ఇంకో అంశం గుర్తుకువచ్చింది – ఆ పిల్లది ఒక ముఠా. ఆమె తండ్రిగా నటించినవాడు వజ్రాన్ని ముందే మార్చేస్తాడు. వాళ్ల ముఠా సభ్యుడే అయిన బేరర్ చేతికి ఇచ్చి వాడి ద్వారా బయటకు చేరవేస్తాడు. వజ్రం బదులు గాజు ముక్క పాస్ ఆన్ చేస్తాడు. దాన్ని ఈ పిల్ల మాయం చేస్తుంది. కానీ ఎలా? గుర్తుకురావటం లేదు.

"ఈ పార్టీలో ఉన్నవాళ్లలో మీ బంధువులెవరైనా ఉన్నారా?" అడిగేడు మురళీధరం.

"ఎవరూ లేరు కానీ అలా అడిగారేం?" అంటూనే అపూర్వ చిరునవ్వు నవ్వింది. "మొన్నామధ్య స్టార్ ఛానెల్‌లో వచ్చిన కథ చూసారా ఏమిటి?" అని అడిగింది.

"ఏ కథ?"

"ఇలాగే ఓ డబ్బున్నవాడి వజ్రం పోతుంది. ఒకతను పేపరు కోసం డబ్బు బయటకు విసిరితే అతని మీదకు అనుమానం వస్తుంది. దాంతో అతను డిటెక్టివ్‌ని వెళ్లి కలిసి తన నిర్దోషిత్వం..."

"కరెక్ట్, కరెక్ట్. మీ కా కథ తెలుసా?" అడిగేడు మురళీధరం ఉద్వేగంతో.

"తెలియకపోవడమేమిటి? భుజంగరావు గారు వజ్రం చూపిస్తూంటే ఆ కథ గుర్తుకొచ్చే నేను తమాషా చేయబోయాను. అది కాస్త ఇలా వికటించింది. ఈ కేసులో అలా పేపరు కోసం కిటికీలోంచి డబ్బు విసిరినవాడు లేడు. ఉంటే వాడిమీదకు అనుమానం పోయేదేమో!" అంది అపూర్వ మొహం అదోలా పెట్టి.

"నేను టీవీలో చూడలేదు కానీ పాత కథ అది. దాన్నే టీవీ ఎపిసోడ్‌లా తీసారేమో. దానిలో ఆ పిల్ల వజ్రం మాయం ఎలా చేస్తుంది చెప్పండి" అని అడిగేడు.

"అదేమవుతుందంటే ఆ పిల్ల చేతికి వచ్చేలోపున వజ్రం వాళ్ల ముఠావాడు మార్చేస్తాడు. ఈ అమ్మాయి చేతికి వజ్రంలా కనబడే ఒట్టి గాజుముక్క వస్తుంది. ఈమె చేతిలోంచి జారవిడిచి లేచి

గౌను దులుపుకుంటూన్నట్టు మంచినీళ్ల గ్లాసు కింద పడేస్తుంది. ఆ గ్లాసుతో బాటు ఆ గాజుముక్కను కూడా తొక్కేసి పొడి, పొడి చేసేస్తుంది. బేరరు వచ్చి మొత్తం గాజుపొడంతా ఎత్తి పారేస్తాడు. దాంతో ఈమె చేతిలో వజ్రం మాయమయిపోయిందన్న భ్రమ కలుగుతుంది..."

మురళీధరానికి తలలో ఒక మెరుపు మెరిసినట్టయింది. అపూర్వ కేసి దీర్ఘంగా చూసి, "మీ కేసులో కూడా గ్లాసు కింద పడిపోయింది." అన్నాడు.

అపూర్వ మొహం వాడిపోయింది. "మై గాడ్, మీరు నన్ను అనుమానిస్తున్నారా? ఆ కథ చెప్పి నా గొయ్యి నేనే తవ్వుకున్నట్టయింది. గభాలున లేచినప్పుడు గ్లాసు కిందపడిపోవడం సహజమే కదా. దానివల్ల అనుమానం రావడం అన్యాయం" అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. అంతలోనే ఆమెకు ఐడియా వచ్చినట్టుంది. "చూడండి సార్, అది నకిలీ వజ్రం కాబట్టి ఆ పిల్ల చితక్కొట్టేయగలిగింది. ఈ హాల్లో ఉన్నవాళ్లలో ఎవరికైనా నాతో కనక్షన్ ఉందని నిరూపించండి చూద్దాం. ఉంటేనే కదా, వజ్రం మార్పిడి సాధ్యపడేది. పైగా నా కేసులో గ్లాసు క్రిందపడిపోయింది కానీ పొడి, పొడి అయిపోలేదు. రెండు, మూడు ముక్కలయిందంతే. బేరర్ వచ్చి ఆ ముక్కలు మాత్రం తీసుకెళ్లిపోయాడు. కావలిస్తే అడగండి" అంది.

మురళీధరానికి ఆమె లాజిక్ నచ్చింది. అయినా ఎందుకైనా మంచిదని గ్లాసు ముక్కలు శుభ్రం చేసిన బేరర్ ఎవరో కనుక్కుని అతన్ని ప్రశ్నించమని కానిస్టేబుల్‌ని పంపించాడు. ఈలోగా అపూర్వ పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా తెలిసాయి. మధ్యతరగతి కుటుంబం. బాగా చదువుకున్నది. కుటుంబం నడిపే బాధ్యత ఆమెపై పడింది. ఉద్యోగం ఏదీ దొరకటం లేదు. సరదాగా హోటల్‌కి వచ్చింది. లక్కీడిప్‌లో గెలిచింది. పార్టీలో భుజంగరావును ఇంప్రెస్ చేసి, ఉద్యోగం సంపాదిద్దామనుకుని ట్రిక్ చేయబోతే ఇలా బెడిసికొట్టింది. ఆమె అందచందాలు, తెలివితేటలు, ధైర్యం మురళీధరాన్ని ముగ్ధుడిని చేసాయి.

కానిస్టేబుల్ తిరిగివచ్చాడు. బేరర్‌ను క్షుణ్ణంగా ప్రశ్నించడంతో బాటు, అతని డ్రస్ కూడా వెతికాడట. వజ్రం దొరకలేదు. గ్లాసు ముక్కలు మూడు మాత్రమే ఉన్నాయి. గాజుపొడిలాటిది ఏదీ లేదట.

తక్కిన వాళ్లని ప్రశ్నించడానికి ఇంకో గంట పట్టింది. చివరికి చూస్తే మురళీధరానికి ఏమీ తోచలేదు. వజ్రం పోవడానికి ఎక్కడా అవకాశం కనబడటం లేదు. రూములో అంగుళం, అంగుళం వెతకడం అయిపోయింది. అపూర్వ బేగ్ హేండిల్ నుండి వజ్రాన్ని పీకి రూములోంచి బయటకు పట్టుకెళ్లిన వారెవరు? తను చదివిన కథ సొంతం గుర్తుకువచ్చినా ప్రయోజనం లేకపోయింది. అపూర్వమీదకే అనుమానం పోతోంది కానీ ఆమె వజ్రాన్ని ఎలా మాయం చేయగలిగిందో తెలియటం లేదు.

ఇది ప్రీ-ప్లాన్డ్ క్రైమ్ కాదు. భుజంగరావు వజ్రం చూపిస్తూండగానే ఆమె కా టీవీ కథ గుర్తుకువచ్చి ట్రిక్ వేసి ఉండవచ్చు. బహుశా ఆమె బ్యాగ్ హేండిల్‌కి వజ్రం అతికించి ఉంచిన సమయంలో దాన్ని గమనించిన వారెవరూ లేరు. ఆమె చెప్పినమాట నమ్మాల్సిందే. వజ్రాన్ని ఎలాగోలా మాయం చేసేసి, హేండ్‌ల్‌కి కాస్త గమ్ పూసేసి, తర్వాత అక్కణ్నుంచే దొంగిలించబడిందని నాటకం ఆడుతూండవచ్చు. కానీ ఎలా మాయం చేసి ఉండవచ్చు?

అపూర్వ లాటి తెలివైనది ఆ కథకు, ఈ సంఘటనకు పోలిక వస్తుందని తెలిసి, ఇంకో రకంగా డీల్ చేసి ఉండవచ్చు. అదీ అప్పటికప్పుడు ఆలోచించి..! గ్లాసు కావాలని పడేసి ఉండవచ్చు. మరిదాన్ని పొడి చేయకుండా వదిలేసింది!? అంటే వజ్రాన్ని బయటకు చేరవేయడానికి బేరర్‌ను ఉపయోగించుకుందా? ఎలా?

మురళీధరానికి ఛట్టున తట్టింది - బేరర్ ఒంగి గ్లాసు ముక్కలు ఏరుతూ ఉండగా అతని కోటు జేబులో వజ్రాన్ని పడేసి ఉండవచ్చు!

మరుక్షణంలో మురళీధరం బేరర్ ఉన్న గదికి పరుగెత్తుకు వెళ్లాడు. అతని డ్యూటీ అయిపోయింది. బట్టలు మార్చుకుంటున్నాడు. మురళీధరం అతని కోటు జేబులో చేతులు పెట్టి జాగ్రత్తగా వెతికాడు.

ఏమీ దొరకలేదు!

ఒక్కక్షణం అయోమయంలో పడ్డాడతను. తేరుకుని బేరర్ గత చరిత్ర గురించి అడగడం మొదలుపెట్టాడు. అడుగుతూండగానే అతని నిశిత దృష్టి యూనిఫాం మడతల మీద పడింది. "నీ డ్యూటీ అయిపోయివచ్చినా కోటు ఇంత తెల్లగా ఎలా ఉంది?" అడిగేడు హఠాత్తుగా.

"అదాండి. ఇందాకా షర్టు మీద టమాటో కెచప్ ఒలికితే, తీసి ఉతకడానికి పడేసి ఇంకోటి వేసుకున్నానండి."

"ఎప్పుడు ఒలికింది?"

"ఏమోనండి. సరిగ్గా గుర్తులేదు. ఇందాకా గ్లాసు ముక్కలు ఏరుతూంటే, పైన టేబుల్ మీద నుండి నీళ్లు కారేయి. దాంతో బాటు కెచప్ కూడా కారిందేమో మరి!"

"సరే, దాన్ని ఉతకడానికి ఎక్కడ పడేసావ్?"

"అదిగో ఆ మూల పడేస్తే రేపు పొద్దున్న ధోబీ వచ్చి తీసుకెళతాడు."

"సరే నువ్వు వెళ్లు."

మురళీధరానికి అర్థమయిపోయింది. అపూర్వే పై నుండి కెచప్ ఒంపి ఉంటుందని. అనుకున్నట్టుగానే కోటు జేబులో వజ్రం దొరికింది. దాన్ని తన జేబులో పెట్టుకుని అపూర్వను పక్కకు పిలిచాడు - "కోటు మార్చడంతో వజ్రం ఆచోకీ తెలియకుండా పోతుందని అంచనా వేసావు. పోలీసులు వెళ్లిపోయాక నెమ్మదిగా వచ్చి తీసుకుందామనుకున్నావు. సింగిల్ హేండెడ్‌గా నేరం చేద్దామనుకున్నావు కానీ ఒకవేళ ఆ బేరర్ గమనించి వజ్రాన్ని తీసేసుకుంటే?" అని అడిగేడు.

తల వంచుకుని, "కుటుంబానికి సంబంధించిన అప్పులు తీర్చాలంటే కొన్ని రిస్కులు తీసుకోక తప్పదు" అంది అపూర్వ నిర్వికారంగా.

"భుజంగరావులాటి స్మగ్లర్‌కి ఒక వజ్రం తక్కువైతే నష్టం ఏమీ లేదు. దొరకలేదని చెప్పేసి దాన్ని అమ్మించి డబ్బు ఇస్తా. అప్పులు తీర్చిపారేయి. ఇకపైన ఇలాటివి చేయనని మాటిచ్చి నన్ను పెళ్లి చేసుకో. ఇద్దరం మీ కుటుంబ భారం వహిద్దాం" అన్నాడు మురళీధరం.

తలెత్తి ఆశ్చర్యంగా చూసింది అపూర్వ - "ఏమిటి!? ఇదంతా తెలిసికూడానా!?"

"ఆహాఁ" అంటూ ఆమె భుజం మీద చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు మురళీధరం. అపూర్వ మురిపెంగా అతని కౌగిలిలో ఒదిగిపోయింది.